# దద్దరిల్లిన తెలంగాణ

## • పాల బిల్లుల కోసం హైవే దిగ్బంధం..



విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించాలని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో గురువారం పాడి రైతులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఈ సందర్భంగా పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. పాడి ఆవులు, గేదెలకు పశుగ్రాసం కొనలేక అప్పుల పాలవుతున్నామన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులను అరిగోస పెడుతున్నదని మండిపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో రైతులు విజేందర్‌రెడ్డి, రంగయ్య, యాకుబా, శేఖర్, దేవేందర్, నిరంజన్, ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – వెల్దండ

## • టీచర్ల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు..




ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ కుమ్రంభీం ఆసిఫాబాద్‌లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. 850మంది విద్యార్థులున్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులతో చదువులెట్ల సాగించాలని మండిపడ్డారు. ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, డీఎస్పీ కరుణాకర్, సీఐ సతీశ్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా విద్యార్థులు శాంతించలేదు. చివరికి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే స్పందించి పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తే వారినే నియమిస్తామని, లేదంటే తాత్కాలిక ఉపాధ్యాయులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి మద్దతు తెలిపారు. – ఆసిఫాబాద్ టౌన్

## • లాభాల్లో వాటా చెల్లించాలి..



సింగరేణికి 2023-24లో వచ్చిన లాభాలను ప్రకటించి 35శాతం వాటాను నెలాఖరు వరకు కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని మూడు డివిజన్లలో గురువారం ఆందోళనలు చేశారు. సింగరేణిలో ఎప్పుడూ లేనివిధంగా 70మిలియన్ టన్నుల రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగిందని, ఆర్థిక సంవత్సరం గడిచి ఆరు నెలలు దాటినా వాస్తవ లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. అనంతరం జీఎంలకు వినతిపత్రాలు అందజేశారు. – గోదావరిఖని

## • జీతాల కోసం సెల్ టవర్ ఎక్కి..



మూడు నెలల నుంచి జీతాలు ఇస్తలేరు. ఇట్లయితే ఎట్ల బతికేది.. కుటుంబాన్ని ఎట్ల సాకేదని ఆవేదనకు గురైన ఓ పారిశుద్ధ్య కార్మికుడు సెల్ టవర్ ఎక్కాడు. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం ఇస్సానగర్‌లో వేతనాలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ జీపీ కార్మికుడు కొమ్ము రాజు గురువారం టవర్ ఎక్కాడు. రెండు గంటలకుపైగా అక్కడే ఉన్నాడు. తోటి కార్మికులు, గ్రామస్తులు నచ్చజెప్పడంతో కిందకు దిగొచ్చాడు. వారం, పదిరోజుల్లో జీతాలు చెల్లిస్తామని ఎంపీవో కృష్ణ తెలిపారు. – బీబీపేట్

## • పని ఒత్తిడి తగ్గించాలి..




సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ పారితోషికంలేని పనులు చేయించడంతో ఆశ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని, పని ఒత్తిడితో మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. పల్స్ పోలియో, లెప్రసీ సర్వే డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – మహబూబాబాద్ రూరల్

## • మాకేదీ 'వరద' సాయం..?



భారీ వర్షాలు, వరదతో సర్వం కోల్పోయిన తమకు ప్రభుత్వం వెంటనే ఆర్థికసాయం అందించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామానికి చెందిన పలువురు బాధితులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. 20రోజులు గడుస్తున్నా నష్టపరిహారం చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్థికసాయం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మొరపెట్టుకున్నారు. – మహబూబాబాద్

## • మా భూములు ఇవ్వం..



ఆదిలాబాద్ జిల్లా రామాయిలో ఏర్పాటు చేసే సిమెంటు పరిశ్రమకు తమ భూములు ఇవ్వబోమంటూ నిర్వాసిత రైతులు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎకరానికి రూ.35లక్షల నుంచి రూ.40లక్షలు పలికే భూములను రూ.8.50లక్షలకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు.
– ఆదిలాబాద్ (నమస్తే తెలంగాణ)

## • మంచినీళ్లు మహాప్రభో..



'ఇదేం పాలన. వీళ్లేం అధికారులు, మూడు నెలలుగా మంచినీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా..?' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీని ముట్టడించారు. ఎస్సీ కాలనీలో నీటి సరఫరా చేయడం లేదని, వ్యవసాయ బోరుమోటర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. జీపీ కార్యదర్శి, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. -సిరిసిల్ల రూరల్

## • జీవనభృతి కోసం బీడీ కార్మికులు..



జీవనభృతి రూ.4,016కు పెంచాలని, లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని బీడీ కార్మికులు ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ధర్పల్లి తహసీల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. బీడీ కార్మికుల పింఛన్లు రూ.4016 కు పెంచుతాని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం సమర్పించారు. – ధర్పల్లి

## • 'ఆసరా' అందించాలి..



ఆసరా పింఛన్ అందించాలంటూ జనగామ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన వితంతు, ఒంటరి మహిళలు గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి కార్యాలయంలోకి ఉద్యోగులను పోనివ్వకుండా అడ్డుకున్నారు. తమ అర్జీలను చెత్తబుట్టలో పారేస్తున్నారని మండిపడ్డారు. పింఛన్ మంజూరు చేయకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. – జనగామ (నమస్తే తెలంగాణ)

---

# ఆమనగల్లుకు 300 ఫీట్ల రోడ్డు?

**ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ లింకుకు రేడియల్ రోడ్ల ఏర్పాటుకు సర్కారు ప్రతిపాదన**

- 916 ఎకరాల భూముల సేకరణకు ప్రణాళికలు
- అంత భారీ వెడల్పు రోడ్లెందుకన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ ప్రయోజనాలేనన్న సందేహాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సహజంగా రెండు ప్రధాన రోడ్ల మధ్య అనుసంధానం కోసం డబుల్ లేన్ రోడ్డు.. మరీ కావాలంటే నాలుగు లేన్ల రోడ్డును ఏర్పాటు చేస్తారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఔటర్‌రింగ్ రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు అనుసంధానంగా ఏకంగా 300 అడుగుల రేడియల్ రోడ్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంటే ఇది ఇంచుమించు ఔటర్ రింగురోడ్డు అంత వెడల్పు ఉంటుంది. అంతేకాదు, ఇది మొత్తం గ్రీన్‌ఫీల్డ్ (పొలాల మధ్య నుంచి ఏర్పాటుచేసే రోడ్డు) రోడ్డు కావటం గమనార్హం. ఎటువంటి ట్రాఫిక్ అధ్యయనం లేకుండా ఎవరికోసం ఇంత భారీ రోడ్డును ఏర్పాటు చేయాలనుకుంటున్నారో అంతుబట్టడం లేదు. దీని వెనుక భారీ రియల్‌ఎస్టేట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### 9 గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు

జాతీయ రహదారులశాఖతో సంబంధం లేకుండా ఆర్ఆర్ఆర్-దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ప్రపంచ బ్యాంకు నిధులతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దీన్ని ఏర్పాటు చేయాలని దాదాపు నిర్ణయానికొచ్చినట్టు సమాచారం. ఓ వైపు దక్షిణ భాగం అలైన్‌మెంట్ అష్టవంకరలు తిరుగుతూ ఇంకా తుది దశకు కూడా చేరుకోని పరిస్థితి ఉండగా, మరోవైపు రేడియల్ రోడ్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఓఆర్ఆర్‌కు, ఆర్ఆర్ఆర్‌కు మధ్య 9 గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో ఓఆర్ఆర్ ఎగ్జిట్ నం-13 నుంచి ఏర్పాటు చేయనున్న రేడియల్ రోడ్డును ఏకంగా 300 అడుగుల వెడల్పుతో నిర్మించాలని నిర్ణయించటంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే దీనిపై వివిధ పత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి.

### స్పెషల్ టౌన్‌ప్లానింగ్ స్కీమ్ కింద ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూసేకరణ

రెండు దశల్లో అభివృద్ధి చేయనున్న ఈ రేడియల్ రోడ్డు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ మీదుగా స్కిల్ యూనివర్సిటీ వరకు సాగుతుంది. ఈ మేరకు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 41.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు 13 (రావిర్యాల) నుంచి రంగారెడ్డి జిల్లా, ఆమనగల్ మండలంలోని ఆకుతోటపల్లి వరకు ఏర్పాటు చేయనున్నారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రతిపాదిత 9 గ్రీన్ ఫీల్డ్ రోడ్లలో ఇదీ ఒకటి. మొదటి దశలో కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ వరకు 18 కిలోమీటర్ల మేర దీన్ని నిర్మించనుండగా, మిగిలింది రెండో దశలో నిర్మించనున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం 6 మండలాల్లోని 15 గ్రామాల పరిధిలో 916 ఎకరాల భూములు సేకరించాల్సిన అవసరం ఏర్పడుతుందని గుర్తించారు. మహేశ్వరం మండలంలోని కొంగరఖుర్ద్, కందుకూరు మండలంలోని లేమూర్, తిమ్మాపూర్, రాచులూర్, గుమ్మడవెల్లె, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్, కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండలంలోని ఆమన్‌గల్, ఆకుతోటపల్లె, యాచారం మండలంలోని కుర్మిద్ద, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్ తదితర గ్రామాల పరిధిలో మొత్తం 916 ఎకరాల భూములు సేకరించాలని ప్రణాళికలు రూపొందించగా, ఇందులో 568 ఎకరాలు ప్రైవేటు భూములుగా గుర్తించారు. మిగిలిన భూముల్లో 156 ఎకరాలు టీజీఐఐసీ, 169 ఎకరాలు రిజర్వు ఫారెస్టు, 23 ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో స్పెషల్ టౌన్‌ప్లానింగ్ స్కీమ్ కింద ల్యాండ్‌పూలింగ్ పద్ధతిలో భూములు సేకరించాలని.. ఇందులో 60 శాతం భూయజమానులకు, 40 శాతం హెచ్ఎండీఏకు భాగం ఉండేలా ప్రతిపాదించారు.

### ప్లానింగ్‌లో సీఎం అంతా తానై

ఎక్కడైనా రోడ్డు నిర్మించాలంటే సమగ్రంగా ట్రాఫిక్ అధ్యయనం చేస్తారు. అయితే, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు విషయంలో ఇదెక్కడా కానరావటం లేదు. ఇటీవల సీఎం నివాసంలో ఆర్ఆర్ఆర్ ప్రాజక్టుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఎక్కడెక్కడ రేడియల్ రోడ్లు ఏర్పాటు చేయాలి? ఆర్ఆర్ఆర్ ఎటువైపు నుంచి వెళ్లాలి? అనే విషయాలు పూర్తిగా ముఖ్యమంత్రే అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. 300 అడుగుల వెడల్పు రేడియల్ రోడ్డు విషయంలోనూ సీఎం చెప్పినట్టే ప్లాన్లు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అసలు అంత వెడల్పు రోడ్డు అవసరమా? లేదా? అనేది అధికారులకూ అంతుబట్టడం లేదు. దీని వెనుక ఎవరి ప్రయోజనాలు దాగివున్నాయో? ఈ రోడ్డు వల్ల బలయ్యే రైతులు ఎవరో? రానున్న కాలమే నిర్ణయించాలి.

**ప్రతిపాదిత 300 అడుగుల రేడియల్ రోడ్డు ముఖ్యాంశాలు**

- ఆరు మండలాల్లోని 15 గ్రామాల పరిధిలో 916 ఎకరాల భూమిని ఈ రోడ్డు కోసం సేకరించనున్నారు.
- 916 ఎకరాల్లో 568 ఎకరాలు ప్రైవేటు భూములు కాగా, 156 ఎకరాలు టీజీఐఐసీ, 169 ఎకరాలు రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉన్నాయి.
- రోడ్డుకు ఇరువైపులా నికర అభివృద్ధి ప్రాంతం (నెట్ డెవలపబుల్ ఏరియా) 519 ఎకరాలు ఉండగా, ఇందులో 354 ఎకరాలు రోడ్లు, పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.